క్లుప్తంగా

విద్యతోనే భవిష్యత్..



భవిత కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

రామభద్రపురం: దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పిస్తే వారి భవిష్యత్‌కు భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బోధన ఎలా సాగుతోంది.... ప్రత్యేక బోధకులు ఎంతమంది ఉన్నారు...మధ్యాహ్న భోజనం నాణ్యత.. తదితర అంశాలపై ఐఈఆర్‌టీలు బి. అచ్యుతరావు, సీహెచ్ రాజేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, లెంక శ్రీనివాసరావు, పత్తిగుళ్ల ఏక్‌నాథ్, తాత్రాసు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల నిరసన



నినాదాలు చేస్తున్న వ్యాపారులు

బొబ్బిలి: పట్టణంలోని కిరాణా వర్తక సంఘ సభ్యులంతా శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. కలాసీలు ఎక్కువ కూలి డిమాండ్ చేయడాన్ని తప్పుబడుతూ నినాదాలు చేశారు. నిరసనలో వ్యాపారుల సంఘ అధ్యక్షుడు కింతలి శ్రీనివాసరావు, వ్యాపారులు పాల్గొన్నారు.

కలాసీల సమ్మెకు మద్దతు..

బొబ్బిలి: పట్టణ కిరాణా వర్తకుల వద్ద పనులు చేస్తున్న కలాసీలు చేపడుతున్న సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎం. గోపాలం, కార్యవర్గ సభ్యుడు వి. రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రైతు కూలీ సంఘం కూడా కలాసీలకు మద్దతు తెలిపారు. ఈ మేరకు రైతు కూలీ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వి. వేణు, పి.లక్ష్మణరావు ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేవరకూ పోరాడాలని, వారికి వెన్నుదన్నుగా ఉంటామని వారు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన



మహిళా పోలీసులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు

వంగర: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సైబర్ నేరాలుపై సచివాలయ మహిళా పోలీసులకు శుక్రవారం అవగాహన కల్పించారు. లోన్ యాప్‌లు, ఓటీపీ మోసాలు ఎలా జరుగుతాయో వివరించారు. ప్రజలు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని, స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసరమైన లింక్‌లను క్లిక్ చేయకూడదన్నారు.

ఉచిత రేషన్ పంపిణీ



వాల్తేరులో రేషన్ బియ్యం అందిస్తున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని వాల్తేరు గ్రామంలో పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం ద్వారా మంజూరైన ఉచిత రేషన్ బియ్యాన్ని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మందుబాబుల వీరంగం..



విరిగిపోయిన సిమెంట్ బెంచీ

బొబ్బిలి: పట్టణ ప్రజలు రన్నింగ్, మార్నింగ్ వాక్ చేసుకునే కోటి చెరువు గట్టు, దిగువ రోడ్డు ప్రాంతాల్లో మందుబాబులు, ఆకతాయిల ఆగడాలు ఎక్కువవుతున్నాయి. మద్యం తాగుతూ గట్టు, కిందన ఉన్న రోడ్డు ప్రాంతాల్లో సీసాలు, ఇతర తినుబండారాల ఖాళీ పేకెట్లను వెదజల్లుతూ వాతావరణాన్ని పాడుచేస్తున్నారు. తాజాగా కూర్చునే కుర్చీలను విరగ్గొట్టడంతో శుక్రవారం వాకింగ్‌కు వచ్చిన పలువురు చూసి ముక్కున వేలేసుకున్నారు.

జయప్రకాశ్ సేవలు చిరస్మరణీయం

బాడంగి: మాజీ ఎమ్మెల్యే, దివంగత తెంటు జయప్రకాశ్ అందించిన సేవలు చిరస్మరణీయమని బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీ నాయన) అన్నారు. జయప్రకాశ్ వర్ధంతిని ఆయన కుమారుడు మాజీ ఎమ్మెల్యే లక్ష్మంనాయుడు ఆధ్వర్యంలో ముగడ, బాడంగిలలో శుక్రవారం నిర్వహించారు. ముగడ తెంటువానిచెరువు వద్దగల జయప్రకాష్ సమాధి వద్ద, బాడంగి కార్యాలయం వద్ద నివాళులర్పించారు.

ప్రజల గుండెల్లో జగనన్న..

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- డిప్యూటీ సీఎం రాజన్నదొర



ప్రభుత్వ పథకాలు అమలుపై ఆరా తీస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ: సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని ఇప్పలవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలసి మంత్రి, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. మూడున్నరేళ్ల పాలనలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. కేంద్ర గిరిజన యూనివర్సిటీని మండలంలోని కుంటినవలసలో ఏర్పాటు చేసేందుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రికి మనమందరం రుణపడి ఉండాలన్నారు. చంద్రబాబు బీసీలను కులవృత్తులకే పరిమితం చేస్తే.. జగన్ మోహన్‌రెడ్డి 82 వేల మంది బీసీలను ప్రజా ప్రతినిధులుగా చేశారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పేద విద్యార్థులందరికీ ట్యాబ్‌లు అందించి ఆంగ్ల మాధ్యమంలో విద్య అందిస్తున్న ఘనత జగనన్నదేనన్నారు. ఎటువంటి పొత్తులు లేకుండా సొంతంగా 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసే సత్తా చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. అందరూ ఏకమై పోటీచేసినా వైఎస్సార్‌సీపీ గెలుపు ఆపలేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, పార్టీ నాయకులు లెంక రత్నాకర్, రెడ్డి రాజప్పలనాయుడు, గేదెల రామకృష్ణ, కలిశెట్టి శ్రీను, పాస్టర్ సూరిబాబు, ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబు, సారిక సురేష్, రాయిపిల్లి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధే సీఎం లక్ష్యం



రామభద్రపురంలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

- కొత్త లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ
- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి కొత్తగా పింఛన్లు మంజూరైన వారికి నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సు ఉన్నవారికే పథకాలు అందేవని, నేడు ఎటువంటి దళారీలు లేకుండా అర్హులందరికీ న్యాయం చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న ప్రతి రూపాయినీ పేదల కోసం ఖర్చు చేస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో అప్పులు తెచ్చి ఆ మొత్తాన్ని తండ్రీకొడుకులు దోచుకున్నారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నవారు మట్టికొట్టుకుపోతారన్నారు. ఏ ఒక్కరూ ఊహించని స్థాయిలో పెద్ద ఎత్తున సామాజిక పింఛన్లు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, వైస్ ఎంపీపీలు బెల్లాన ప్రసాదరావు, పెంకి అరుణ, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, ఎంపీడీఓ రమామణి, తహసీల్దార్ పి. గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

బాడంగికి 'చిట్టి గురువులు' అవార్డులు



కలెక్టర్ నుంచి చిట్టిగురువులు అవార్డు అందుకుంటున్న ఎంపీడీఓ అక్కారావు

బాడంగి: మండలంలో చిట్టి గురువులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు గాను అధికారులు, చిట్టి గురువులకు కలెక్టర్ సూర్యకుమారి శుక్రవారం అవార్డులు ప్రదానం చేశారు. జిల్లాలో శతశాతం అక్షరాస్యత సాధించేందుకు గాను ప్రభుత్వం చిట్టి గురువులు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ఎంపీడీఓ అక్కారావు, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం ఎస్. త్రినాథరావు, పింద్రంగివలస యమ్మల రవిబాబు, బాడంగి క్లస్టర్ వలంటీర్ చంద్రబాబు, బొత్సవానివలస వెల్ఫేర్ సహాయకుడు వెంకటరావు, చిట్టి గురువులు మడక భారతి, మరడాన దేవకి కలెక్టర్ చేతులమీదుగా విజయనగరంలో అవార్డులు అందుకున్నారు.

వేగవంతంగా రీ సర్వే



గ్రామ సచివాలయ సర్వేయర్లకు సిమ్ కార్డులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ దోల రాజేశ్వరరావు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష పథకంలో భాగంగా చేపడుతున్న భూముల రీసర్వేను సచివాలయ సర్వేయర్లు మరింత వేగవంతం చేయాలని తహసీల్దార్ దోల రాజేశ్వరరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గ్రామ సచివాలయ సర్వేయర్లకు సిమ్‌కార్డులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సర్వేయర్లందరికీ సిమ్‌కార్డులు పంపిణీ చేపట్టామని తెలిపారు. భూముల రీసర్వేలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా రైతుల సమక్షంలో రీసర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బెంచీల వితరణ



కృష్ణారావు వితరణ చేసిన బెంచీలలో కూర్చున్న విద్యార్థులు

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన కిర్ల కృష్ణారావు తన భార్య అలివేలు మంగ తాయారు జ్ఞాపకార్థం రూ. 80 వేల విలువ చేసే బెంచీలను శుక్రవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

బొబ్బిలి రూరల్: మండలానికి కొత్తగా మంజూరైన 393 పింఛన్లను ఆయా లబ్ధిదారులకు శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ అల్లు భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతికుమారి పాల్గొనే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ



మాట్లాడుతున్న ఏపీఎం చక్రపాణి

వంగర: పౌష్టికాహారం తీసుకోవడంతోనే రక్తహీనతను నివారించవచ్చని ఏపీఎం మీసాల చక్రపాణి అన్నారు. శుక్రవారం స్థానిక వివేక్ మాస్టర్‌మైండ్స్ హైస్కూల్‌లో రక్తహీనతతో బాధపడే వారి లక్షణాలపై అవగాహన కల్పించారు. మహిళా సంఘాల ద్వారా కిశోర బాలికలకు రక్తహీనత నివారణపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. హిమోగ్లోబిన్ శాతం పెంచేలా చైతన్యం కల్పించాలని కోరారు.

చీరల పంపిణీ



వన్నలిలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమణ

రేగిడి: విశ్రాంత బ్యాంకు మేనేజర్ వంతరాం చంద్రమౌళి తన కుమారుడు దివ్యతేజ కొడుకు షన్విక్ సాయి వేదాంసు బర్త్ డే సందర్భంగా పేదలకు చీరలు శుక్రవారం వితరణ చేశారు. తన సంపాదనలో కొంత మొత్తాన్ని ఆయన ఇలా సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విశాఖపట్నం నుంచి చీరలను పంపగా, వాటిని సర్పంచ్ గార రమణ పేదలకు అందజేశారు.

పరిశీలన



కృష్ణాపురం మిల్లులో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజారావు, సీఎస్‌డీటీ సాయికృష్ణ

బొబ్బిలి రూరల్: మండలంలోని కృష్ణాపురం, కోమటపల్లి, పిరిడి, తదితర గ్రామాల్లోని రైస్‌మిల్లులను తహసీల్దార్ ఎన్. రాజారావు, సీఎస్‌డీటీ ఆర్.సాయికృష్ణ శుక్రవారం పరిశీలించి ధాన్యం తరలింపు, కొనుగోళ్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి పరిష్కరిస్తామన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ కనబరచాలి

తెర్లాం: సఖీ గ్రూపుల్లో ఉన్న కిశోర బాలికలంతా వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని తెర్లాం-1,2 సచివాలయాల మహిళా పోలీసులు రమాదేవి, తులసి అన్నారు. స్థానిక ఐదో అంగన్‌వాడీ కేంద్రం వద్ద కార్యకర్త వై.శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం సఖీ గ్రూపులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు మాట్లాడుతూ కిశోర బాలికలు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్, దిశ యాప్ వినియోగం, పోక్సో చట్టం, బాల్య వివాహాలను అరికట్టడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, సునీత, విజయదుర్గ, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కొత్త పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



రేగిడిలో పెన్షన్లు అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చేతుల మీదుగా లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల బాగోగుల కోసమే నిరంతరం పరితపిస్తున్నారని, ఆయన అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలతో ఎంతోమంది జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర వ్యాప్తంగా పథకాల పంపిణీ జరుగుతోందన్నారు. ఒకప్పుడు పెన్షన్ తీసుకునేందుకు వృద్ధులే పెన్షన్ ఇచ్చే వారి వద్దకు వెళ్లాల్సిన దుస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. వలంటీర్లే నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి మరీ పెన్షన్ ఇస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. పథకాల డబ్బులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేయడంతో ఎక్కడా అవినీతికి తావులేదన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. అప్పటి పాలనకు, ఇప్పటి పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రతిపక్షాల మాయ మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహన్‌రావు, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథం, తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని నందబలగ గ్రామంలో కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కంబాల జోగులు చేతుల మీదుగా లబ్ధిదారులకు ప్రభుత్వం పెంచిన పెన్షన్ నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శంకరరావు, వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, సర్పంచ్ కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

రాజాం సిటీ: పెన్షన్ల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పొగిరి గ్రామంలో సర్పంచ్ పొగిరి కృష్ణవేణి చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్తగా పెంచిన పెన్షన్ నగదును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పి.లెనిన్‌బాబు, కార్యదర్శి ఎ.లక్షుంనాయుడు పాల్గొన్నారు.

రేగిడి: విశాఖపట్నంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని పనసలవలస గ్రామానికి చెందిన కడగల అప్పలనరసమ్మ వద్దకు వలంటీర్ వేణు శుక్రవారం వెళ్లి, పెన్షన్ అందజేశారు.

వంగర: మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు వలంటీర్లు పెన్షన్లు అందజేశారు.

పనసలవలసలో ఆధ్యాత్మిక సభ



ప్రసంగిస్తున్న రామానుజ జియర్‌స్వామి

రేగిడి: మండలంలోని పనసలవలస గ్రామంలోని శ్రీ రాజవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిదండి అహోబల రామానుజ జియర్ స్వామి మాట్లాడుతూ దేశంలోని హిందూ దేవాలయాలు పరిక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. భక్తులు నిత్యం విగ్రహారాధన చేయాలని, ఆలయాల సందర్శనతో మోక్షం కలుగుతుందన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మంచి నడవడిక వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గేదెల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులంతా నిర్మాణాలను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కంచరాం సమీపంలో ఉన్న జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. అనంతరం ఇళ్ల నిర్మాణాల స్థితిగతులపై లబ్ధిదారులతో మాట్లాడారు. స్వయం శక్తి సంఘాల్లోని మహిళలకు మెప్మా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

రాజాం సిటీ: స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలతో పాటు ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించనున్నామని తెలిపారు.

ఎమ్మెల్యే దృష్టికి కలాసీ, వ్యాపారుల సమస్య



ఎమ్మెల్యేకు సమస్య వివరిస్తున్న వ్యాపారులు

బొబ్బిలి: పట్టణంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న కిరాణా వర్తకులు, కలాసీల కూలీ రేట్ల పెంపు పంచాయితీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు వద్దకు చేరింది. కూలి రేట్లు బాగా ఎక్కువగా ఉన్నాయని, వీటి వల్ల ధరలు పెరుగుతున్నాయనీ వ్యాపారులు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు దృష్టికి తీసుకువచ్చారు. శుక్రవారం రాత్రి వ్యాపారులంతా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని సమస్య పరిష్కరించే ప్రయత్నం చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ఇరువర్గాలతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకుందామన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజాం సిటీ: ప్రతీ వేతనదారుడు రూ.257 వచ్చేలా పనులు చేయాలని ఏపీఓ కె.సాయిరాం సూచించారు. మండలంలోని మారెడుబాక ఫీడర్ చానల్‌లో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించిన ఆయన వేతనదారుల మస్తర్లు తనిఖీ చేశారు. రెండు పూటలా పనులకు హాజరై, ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలని తెలిపారు. అలాగే ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు నమోదు చేయాలన్నారు.

ఉద్యమ పితామహుడు 'మార్పు'



బాలకృష్ణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

బొబ్బిలి: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు దశాబ్దాల కిందటూ ఉద్యమ బాట పట్టిన నాయకుడు మార్పు బాలకృష్ణమ్మ అని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి. ధనుంజయ నాయుడు, ఉపాధ్యక్షుడు సీహెచ్ రామారావు అన్నారు. పట్టణంలోని విజేత స్కూల్లో బాలకృష్ణమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల కార్యదర్శి కేజీకే నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకట రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు డి. వెంకటనాయుడు, కార్యదర్శి గంట సత్యనారాయణ, బోను భాస్కరరావు, పీపీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

- విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డితో ట్రాక్టర్ ట్రక్కు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న రాజాం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది

తెర్లాం: వరిగడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి వరిగడ్డి, ట్రాక్టర్ ట్రక్కు కొంత భాగం దగ్ధమైన సంఘటన మండలంలోని అరసబలగలో శుక్రవారం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు... మండలంలోని గోపాలవలసకు చెందిన దొడ్ల కిశోర్ పశువుల మేత కోసం అరసబలగ గ్రామంలో ఓ రైతు వద్ద వరిగడ్డిని కొనుగోలు చేశాడు. సోమిదవలసకు చెందిన బోను సురేష్ ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకొని వరిగడ్డిని ఎక్కించి తిరిగి వస్తుండగా అరసబలగ వద్ద ఉన్న తోటపల్లి కాలువ గట్టుపై కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వరిగడ్డితో పాటు ట్రాక్టర్ ట్రక్కు కూడా కొంతమేరకు కాలిపోయింది. చుట్టుప్రక్కల బావుల్లో నీరు తోడేందుకు ఉన్న ఆయిల్ ఇంజన్ల ద్వారా రైతులు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంపై రాజాం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ట్రాక్టర్ డ్రైవర్, రైతులు దూరంగా వెళ్లిపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ట్రాక్టర్‌కు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లింది.